# పాదు

దాకరపు బాబూరావు కవిత్వం



# వాడు

దాకరపు బాబూరావు... కవిత్వం

**పాదు**

దాకరపు బాబూరావు కవిత్వం

ప్రచురణ కాలం : సెప్టెంబర్ 2009

A : **దాకరపు బాబూరావు**

ప్రతులకు : రాష్ట్రంలోని అన్ని పెద్ద పుస్తకాల షాపుల్లో

**శ్రీమతి దాకరపు కమలకుమారి**
కమలా నిలయం, 20-201/1
శాంతినగర్, తిరువూరు - 521 235
కృష్ణా జిల్లా.
సెల్ : 9848993599, 9030830602

వెల : **రు. 30/-**

కవర్ డిజైన్ : ఎ. గిరిధర్

కంపోజింగ్ : లక్ష్మిగణపతి ప్రింటర్స్,
మెయిన్ రోడ్, గంపలగూడెం
ఫోన్ : 9291576010

ముద్రణ : శ్రీశ్రీ ప్రింటర్స్
అరండల్‌పేట , విజయవాడ - 2
ఫోన్ : 0866-2433359, 9490634849

# నా మాట

అంతర్మధనం, ఆలోచించే ప్రతి మనిషినీ ఆక్రమించుకుని యేలుబడిచేస్తుంటుంది. జీవితం అంటే ఏమిటో అర్ధంచేసుకునే వయసొచ్చేలోగానే జీవితం చెయ్యి జారి పోతుంది.

జీవితాన్ని సిన్మాల్తోనూ/కథల్తోనూ బేరీజు వేసుకుని ఊహతో జీవితాన్ని అన్వయించుకోవాలనే తాపత్రయం – లేలేత ప్రాయంలో!

ఏదీ సర్ధిచెప్పుకోలేనితనం. యిది యిలా వుండాలి... యిలా ఎందుకుంది? యిలా వుంటే బాగుండేది కదా! ఇత్యాది ఆలోచన్ల పోరాటం ఒక కోణమైతే – చిన్నతనం నుంచీ అంతర్నేత్రం చూసిన ప్రతి సన్నివేశం, మనసుకేన్వాస్‌పై దృశ్యాలుగా... పదిల పర్చుకున్నప్పటికీ కొన్ని కొన్ని భావోద్వేగాల్ని బిగపట్టుకోలేని తనం మరోకోణం.

సామాజిక అంశమైన మనిషి – వ్యక్తిగతంగా స్ధిరపడుతూ సమాజాన్ని అధిగమించాలనే తాపత్రయంలో దేనికోసమైతే తాను ప్రయత్నిస్తున్నాడో... తన ప్రయత్నాల్లో ఎప్పుడూ తన చేతిలో హెడ్ అండ్ టైల్‌గా తిరిగే నాణెంలాగే తనను తాను ప్రదర్శించుకుంటూ, తాను పొందినది సంతోషంగానూ తానుపోగొట్టుకున్నది బాధగానూ నిర్వచించుకుంటూ జీవన పోరాటంలో ఎన్నో చేజార్చుకుంటున్నాడు.

చిన్నతనం నుంచీ ఏదీ సర్ధిచెప్పుకోలేనితనం. విత్తనాన్ని భూమిలో నాటాక అది మొలకెత్తిందో లేదో చూద్దామని తవ్విబయటకు తీసి చూసే అమాయకత్వం. అమ్మ జాబిల్లిని చూపించి అదిగో చందమామ అంటే మామ ఎప్పుడొస్తాడు అని ప్రశ్నించే అమాయకత్వం.

చదువుతుంటే ఏదో కొత్తలోకంలో విహరిస్తున్నట్లనిపించి ఆ తర్వాత ఏమర్థమైయ్యిందో అర్థంకాని కవితాలోకంలోని అమాయకత్వం.

చిన్నప్పటి క్లాసుబుక్స్‌లో పిప్ ఎస్టెల్లాని ప్రేమించి భంగపడటం, ఆ భంగపాటు నాకే జరిగినట్లు తెలిసీ తెలీక ఫీలైపోవటంలోని అమాయకత్వం.

రేడియో ప్రోగ్రాముల్లో లైవ్‌లో కవితలు చదువుతూ నా కవితల్ని మెచ్చుకుంటూ వచ్చే ఉత్తరాలకోసం ఆత్రంగా ఎదురుచూసిన అమాయకత్వం. పత్రికల్లో అచ్చయిన నా అక్షరాల్ని చూసుకొని ఆనందాన్ని తడుముకున్న అమాయకత్వం.

కులం లేదు, మతం లేదు మనమంతా ఒక్కటే అని చెపుతూనే పరిచయమవ్వగానే 'మీరేవుట్లా' అని ప్రశ్నించే సమాజం ఎప్పుడు మారుతుందని ప్రశ్నించుకునే అమాయకత్వం.

కోరుకున్న విధంగా సమాజం కనిపించకపోతుందా అని ఎదురుచూసే అమాయకత్వం.

గాటుచేస్తే
గాయపడిన పత్రం
కన్నీరు కార్చినట్లే
గాయపడిన హృదయమూ
అంతే
బాధను స్రవిస్తుంది
నాణేనికి ఒక వైపు సమాజం వుంటే
రెండో వైపు ఖచ్చితంగా కవేవుంటాడు

నాణేనికి రెండోవైపు నుంచి వస్తున్న ఆలోచన్ల నుంచి పుట్టేబాధని అక్షరాల్లోకి తర్జుమా చేసుకుంటుంటే 'కవిత్వం' అంటూ ప్రచురించిన అన్ని పత్రికలవారికీ

'ఈ కవితలన్నీ పుస్తకంగా వేసేద్దాం' అంటూ 'పాదు'గా చేసిన వంశీకృష్ణగారికి, నేనెవరో తెలీకపోయినా అడగంగానే ముందుమాట రాసిన

ప్రముఖ కవి విమర్శకులు డా॥ అద్దేపల్లి రామ్మోహన్‌రావుగారికి, 2008 సం॥రానికి జాతీయ స్థాయిలో 'ఎక్స్‌రే' ఉత్తమ కవితా అవార్డుతో ఆదరించిన కొల్లూరి గార్కి, 2009 సం॥లో జ్వాలాముఖి స్మారక కవితల పోటీలో రాష్ట్రస్థాయిలో బహుమతిచ్చిన ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక సామాఖ్య విజయవాడ వారికి, కవర్‌డిజైన్ చేసిన గిరిధర్ గారికి, 'పాదు'ని అందంగా ముద్రించిన శ్రీశ్రీ ప్రింటర్స్ విజయవాడవారికి,

నన్ననుక్షణం ప్రోత్సహిస్తున్న ఎంతో మందికి
ప్రతి ఒక్కరికీ పేరు పేరునా
అయితే చివరగా చెపుతున్నా మొదటే చెప్పాల్సిన నా అర్ధభాగం 'కమల'కి

మనసుకు గాయమైతేనే కవిత్వం పుడుతుందన్న
మాటల్లోని నిజానికి మల్లే
నా మనసును గాయపర్చిన అనేక మందికి

... నా కృతజ్ఞతలు

**దాకరపు బాబూరావు**

# సంస్కృతి 'పాదు'లో కవిత్వ జలధార

ఉన్నతమైన విలువలన్నీ మట్టిలో కలిసిపోతున్న కాలంలో మనం జీవిస్తున్నాం. 'నాగరికత' అనబడే ఒక మాయ లేడి వెంట పరుగెత్తుకు పోతున్న ఎవరికీ 'సంస్క ృతి' అనే మౌలిక జీవన ప్రయాణం మనస్సుక్కెడంలేదు. 'నాగరికత' అంటే రోడ్లు, భవనాలు, భారీ పరిశ్రమలు, ధన సంపాదన, వ్యక్తి స్వేచ్ఛ పేర సామాజిక విలువల విధ్వంసం అంతిమంగా 'అమెరికా' ఎలా ఉందో అలా మారిపోవడం. అమెరికా దిగంబరత్వాన్ని అందంగా సొమ్ముచేసుకుంటుంటే, మనకీ మన దుస్తులకంటే అదే అందమనే భ్రమకలగడం 'నాగరికత'. అమెరికన్ ఇంగ్లీష్ ఉచ్ఛారణను గూడా అనుకరిస్తూ, మన ప్రాణమైన తెలుగు భాషకంటే అదే గొప్పదనుకోవడం 'నాగరికత'. సమాజ సమిష్టి జీవన సౌందర్యం కోసం అడుగడుగునా విగ్రహ సంస్కృతిని ఆత్మలో జీర్ణం చేసిన మౌలిక భారతీయ భావధారని, విచ్చలవిడి వ్యామోహాలకోసం తగలబెట్టుకోవడం 'నాగరికత'. దీని ముద్దు పేరే ఈనాటి పాలకులు ప్రాణదీక్షగా పెట్టుకున్న 'నగరీకరణ'. పల్లెతనం పూర్తిగా నశింపజేసే ప్రయత్నమే 'నగరీకరణ'. మరోవిధంగా చెప్పాలంటే అందమైన రోడ్లకింద అనుబంధాన్ని పాతెయ్యడమే నగరీకరణ. అసెంబ్లీల్లో నగరీకరణ గూర్చి చర్చలే తప్ప, కోల్పోతున్న సంస్కృతిని గూర్చి ఒక్క చర్చ గూడ జరగదు. నాగరికత అంటే ఈనాడు 'వ్యాపార నాగరికత' అనేదే ప్రధానమైన అర్థం. వ్యాపారం, డబ్బు, సంస్కృతిని శాసిస్తే, అక్కడ విలువలన్నీ విధ్వంసమైనట్లే.

ఈ ఆవేదనే దాకరపు బాబూరావు కవితలకి ప్రధాన నేపధ్యంగా కనిపిస్తుంది. అసలు పల్లెతం గూర్చి రాస్తున్న కవులకి తమ చిన్ననాటి

అనుభవాలే ఆధారమౌతున్నై. స్మృతులు వారిలో బాధాగ్ని రగిలిస్తున్నై. 'చిరునామా కోసం' అనే కవితలో మొత్తం పల్లెనే ఒక పడుచుగా సంకేతించి, చెప్తాడు కవి. ఒక మనోహరమైన చిత్రాన్ని మన కళ్ళముందు నిలిపిన ఈ పంక్తుల్ని చూడండి..

'పచ్చిని పావడాలో రంగవల్లుల ఓణీవేసుకుని
ముద్ద బంతుల దొంతర్లని తల్లో తురుముకుని
ముగ్గుల పుష్పాన్ని ఆహ్వాన పత్రాలుగా రచించుకుంటూ
పదహారణాల చెంగుల్ని బొడ్లో దోపుకుని
తేరిమబ్బుల ముంగురుల్ని సున్నితంగా తొలగించుకుంటూ
పొలం గట్లవెంట మమ్మల్ని
పిట్టల్ని తోలుతున్నట్లే తరుముతూ ఆటపట్టిస్తుండేది'

ఈ వర్ణన పల్లెలోని ఒక పడుచుకీ సరిపోతుంది. పల్లెనే పడుచుగా ఏకం చేయడానికీ సరిపోతుంది. ఈ వర్ణనలోని సౌందర్యం ప్రయోజనాత్మకంగా రూపొందింది. ఆ ఉన్నత స్థితినించి పతనమైపోతున్న పల్లెతనాన్ని యిలా చెప్తాడు.

'మొన్న పండక్కి వెళ్ళి
పల్లెపడుచును పలకరిద్దామని
బస్సుకోసం చూద్దునుగదా
ఒకటే ఆటోల రొద
ప్రపంచీకరణ అక్షరాలు నేర్చుకుందేమో
పత్తాలేదు.........!
పొలం వెళ్ళిందేమోనని వెతికి చూద్దునుగదా
రియలెస్టేట్ రాళ్ళు రంగుల జండాల్తో
దిష్టి పిడతల్లా పొలాల్లో వెక్కిరిస్తున్నాయి'.

ఇంకా పల్లెల్లో వస్తున్న ప్రపంచీకరణ దుష్ఫలితాల్ని గూర్చి చెప్తు ముగింపులో యిలా అంటాడు.

'ఆఖరికి పొలుపోక అడిగా
మా పల్లె పడుచు ఏదని
అది పట్నానికెప్పుడో వలసవెళ్ళిపోయిందని
చెప్తున్నారు'

ఈ ముగింపుకి కూడా రెండు ముఖాలున్నై. పల్లె తన సంస్కృతిని కోల్పోయి నగరీకరణకు లోనౌతోందని ఒకటి. పల్లెల్లోని వాళ్ళు అక్కడ బతకలేక, పట్టణాలకు వలసవెళ్ళిపోతున్నారన్నది రెండోది. ఇది, అభివ్యక్తి పట్ల శ్రద్ధ చూపడం వల్ల వచ్చిన ఫలితం.

ఎన్ని వైరుధ్యాలు ఎన్ని విధాలుగా ఉన్నా, భారతదేశపు మౌలిక సంస్కృతి, ఔన్నత్యం కుటుంబ వ్యవస్థ మీద ఆధారపడి ఉంది. తరతరాలుగా మంచి గుణాల్ని నిలుపుకోవడానికీ, జీవితాన్ని ఆనంద అనుబంధాల్తో జీవితాంతం అనుభవించడానికీ, వ్యవస్థ ఛిన్నా భిన్నం కాకుండా ఉండడానికీ కుటుంబ వ్యవస్థ మూలకారణం. విచ్చలవిడి సంస్కృతి ప్రధానమని భావించే దేశాల్లో తర్వాత తరాల్ని గూర్చి ఆలోచించే నిలకడలేదు. అవి 'టెర్మినేటర్' విత్తనాల వంటివి. విచ్చలవిడి దేశాలమీది తాత్కాలిక మోజు, వ్యామోహం పెరిగిపోతున్న లేదా పెంచబడుతున్న ఈ కాలంలో కుటుంబ వ్యవస్థ యిక్కడ కూడా బీటలు వారడం ప్రారంభమైంది. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నకుటుంబాలై, చివరకు బండి నడవడానికి అవసరమైన రెండు చక్రాలు కూడా దేని దోవన అది నడిచే ధోరణి కూడా వస్తుందన్న భయం సర్వవ్యాప్తంగా ఉంది. ఇంగ్లీషువాడు మోజుకలిగించే పేర్లు పెట్టడంలో నేర్పరి. 'పేరంట్స్' అంటే తల్లిదండ్రులు. తల్లిగాని తండ్రిగాని ఒక్కరే ఉంటే వాళ్ళని 'సింగిల్ పేరంట్' అనే ముద్దు పేరుతో పిలుస్తాడు. కుటుంబ వ్యవస్థకి ప్రేమ, అనుబంధం పునాది. కుటుంబంలోనే మనిషి ప్రేమని అర్థంచేసుంటాడు. ఈ వస్తువుపై బాబూరావు 'పాదుచేయాలి' అనే బలమైన కవితను రాశాడు సాంస్కృతీ సమాఖ్యవారి 'జ్వాలాముఖి' స్మారక సాహిత్య పురస్కారం కూడా ఈ కవితకి లభించింది. సమకాలీన యాంత్రిక నాగరికతలో

కుటుంబానుబంధాల్నించి దూరమై, అవేదలో మునిగిన వ్యక్తి ఆలోచనల్నే ఆత్మాశ్రయంగా ఈ కవితలో చెప్తాడు. కుటుంబంనించి దూరమై, అంతులేని వేదన ననుభవించి, చివరకు

'సెల్‌ఫోనుల్లో, సిమ్‌కార్డుల్లో, ఎస్‌ఎమ్మెస్సుల్లో
బంధీలైన మాటల పిట్టల్ని
బిజీ పంజరాల్లోంచి
స్వేచ్ఛగా బయటకు వదలాలి'

అనే నిర్ణయానికి వస్తాడు. ముగింపులో కుటుంబ అనుబంధాల ప్రాధాన్యాన్ని యిలా చెప్తాడు.

'మునుపటి మనిషిగా నన్నునేను నిలబెట్టుకోవాలి
నా కుటుంబంలోకి
నా ప్రస్థానం తిరిగి ప్రారంభించాలి
అమ్మా, నాన్న, అన్నా, చెల్లి, అక్క, తమ్ముడు
తెగిపోయిన రక్త సంబంధాల గట్లు వేయాలి
ఉమ్మడి కుటుంబాల మొదళ్ళకు పాదు చేయాలి
శాఖోపశాఖలుగా విస్తరింపచేయాలి'

లోకమిలా అయిందని వర్ణించకుండా, తను పడే బాధగా ఆత్మాశ్రయంగా చెప్పడంలో కవిత నేరుగా పాఠకుడి గుండెల్లోకి వెళ్తుంది.

తీసుకున్న వస్తువుని ఎన్నో విధాలుగా చెప్పడం కవి ప్రతిభాధీనం, అయితే కొత్త వస్తువుని తీసుకోవడం, దానంతటదే ఒక విశిష్టత ఔతుంది. అందుకే కవులెప్పుడూ ఒక నూతన వస్తువు కోసం తపిస్తూ ఉంటారు. 'పాదు' కవితా సంపుటిలో 'నగర సుందిరి' అనేది ఒక కొత్త వస్తువు. తెల్లవారుజామున నగరంలోని అన్ని కోణాల్ని పరిశీలించడమన్నది చాలా అరుదుగా లభించే అవకాశం. ఆ సమయంలో ఆధునిక నగరం ఎలా కనిపిస్తుందో బాబూరావు ఈ కవితలో వర్ణించారు. ఇది హైద్రాబాదునే ప్రతి ఫలిస్తుంది. ఇరానీ చాయ్‌ని స్పృశిస్తూ ప్రారంభమౌతుంది.

'ఆవులింతల్ని
ఇరానీ చాయ్ వేడి సెగలకప్పుల్లోకి
ఒంపుకునే బద్ధకం'

ఈ కవితలో ఏ నగర కోణాన్నో వర్ణించినా, భావాన్ని కవితాత్మకం చేసిన వైఖరి ఉంది. తెల్లవారుతుండగా రహదారులు ఎన్నో చిన్న చిన్న మార్పుల్ని పొందుతూ, క్రమంగా అతిస్పష్టంగా కనిపిస్తై. ఈ అంశాన్ని యిలా చెప్తాడు.

'రంగస్థల పాత్రధారుల్లా
పగటి ప్రయాణానికి
డ్రెస్ రిహార్సిల్స్ వేసుకుంటున్నట్లు
రహదారులు'

కొన్ని వర్ణనల్లో వ్యంగ్యం తొంగిచూస్తుంది.

'అర్ధరాత్రి స్వాతంత్ర్యపు ఆనవాళ్ళుగా
షట్టర్లెత్తుకు కూర్చున్న కాల్ సెంటర్లు'

అర్ధరాత్రి కూడా అస్వతంత్రంగా పనిచేసే వాళ్ళ శ్రమకు కారణం. ఈ దేశానికి అర్ధరాత్రి స్వతంత్ర్యం రావడమే కారణమనే ధ్వని ఉంది.

దాకరపు బాబూరావుకి కేవలం అభిప్రాయాల్ని వాచ్యంగా చెప్పే విధానంపై కాకుండా, అలంకారికంగా అభివ్యక్తి చెయ్యడం మీద అభినివేశం ఉంది. ఎవరైనా కవిగా ఎదగడానికి అవసరమైన సామాగ్రి యిది. మొదటికవితలోనే, వృద్ధాశ్రమాన్ని, వాడిన తోటతో కవితనిండా సమగ్ర రూపకంగా చేసి వర్ధిస్తాడు. అందులో ఒక వర్ణన యిది.

'ఆనందాల పూల మొగ్గల్ని
పిల్లలు బలవంతంగా తెలంపుకెళ్ళిపోతే
నిరసనని
హరితం కోల్పోయిన పత్రాల వెనకదాచుకుని
తొడిమనుండి జారడం కోసం
ఎదురుచూస్తున్న

శాపగ్రస్త పండుటాకుల్లా వాళ్ళు
పిల్లల నిర్లక్ష్యపు చేరాతలకి
నిలువెత్తు సాక్షులైన
అగణిత అమ్మానాన్నలు'

పండుటాకుతో పోల్చడానికి, సుదీర్ఘమైన అంశాల అన్వయంతో సాగిన రూపమానం గమనించవచ్చు. ఇలాంటి వాటిని 'మిల్టానిక్ సిమిలీస్' అంటారు.

దాకరపు బాబూరావు తన మార్గాన్ని యింకా విస్తృతంచేసుకుంటూ, సామాజిక రాజకీయల పరిష్కార అవగాహనల్ని యింకా పెంచుకుంటూ, ఉన్నత స్థాయి కవిగా పరిణమించాలని ఆశిస్తున్నాను.

**- అద్దేపల్లి రామమోహనరావు**

# 'పాదు' కొన్న క్రమం


| | |
|---|---|
| నిర్లిప్త నందనం | 19 |
| బియ్యం | 21 |
| బాల్యం | 21 |
| చివరకు మిగిలేది | 22 |
| నగర సుందరి | 23 |
| ఆనవాళ్ళ కోసం | 25 |
| వేదన | 27 |
| తెగిన పతంగం | 29 |
| చుక్కల్లో ధరలు | 30 |
| కన్నీటి చుక్క | 30 |
| చేలు | 31 |
| బడ్జెట్ | 32 |
| ఆశల పూలు | 33 |
| వింత లోకం | 34 |
| సొగసు | 35 |
| కొన్ని జ్ఞాపకాలు | 36 |
| స్మృతులు | 37 |
| ధరిత్రి | 39 |
| వంతెన | 41 |
| ఆశల మొగ్గలు | 43 |
| నేల తల్లి | 44 |
| పిచ్చుకలు తిరిగొచ్చాయి | 46 |
| ప్రభూ! క్షమించు | 48 |
| మా ఊరు - వెన్నెల జలతారు | 50 |
| వర్తమానం | 53 |
| మృత్యు సంతకం | 56 |
| తను | 59 |
| చిరునామా కోసం | 61 |
| రెండో కోణం | 63 |
| లైఫ్ సర్టిఫికెట్ | 66 |
| పాదు చేయాలి | 69 |
| మట్టి మనిషి | 72 |
| వేదన రాగం | 75 |
| తాళి కోసం | 78 |

# నిర్లిప్త నందనం

ఆ తోటలోకి వెళ్ళాను
తోటే.....
కాకపోతే వాన ప్రస్థ పక్షులు బలవంతంగా వాలిన
దిగులు చెట్ల గుబులు వనంలా కన్పిస్తోంది....

ఆనందాల పూల మొగ్గల్ని
పిల్లలు బలవంతంగా తెంపుకెళ్ళిపోతే
నిరసనని
హరితం కోల్పోయిన పత్రాల వెనుక దాచుకుని
తొడిమ నుండి జారటం కోసం
ఎదురుచూస్తున్న
శాపగ్రస్థ పండుటాకుల్లా వాళ్ళు
పిల్లల నిర్లక్ష్యపు చేరాతలకి
నిలువెత్తు సాక్షులైన
అగణిత అమ్మానాన్నలు

వార్ధక్యపూలు వాడినా రాలని తొడిమల్లో
ఇంకా వేళ్ళాడుతున్న వయసువూడలు
విషాదాల ముడుల్ని ప్రశ్నార్ధకాల్లోనే విప్పుకోవాలని
బోసి నోళ్ళల్లో ఉంగలు చుట్టుకుంటున్న నిట్టూర్పుల్ని
వేదనకు వేదికలు చేసుకుంటూనే
బలవంతంగా విశ్రమిస్తున్న పడమటి సందెలు

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1322**

* * *